బూటు సంహారమ్

ఉద్దేమట్టి గోపాలరావు

'రత్నం' అని గేటు దగ్గర నిలబడి కేకేశాడు వెంకట్రామయ్య. అప్పుడేటౌను నుండి బస్ దిగి వచ్చాడు. ఇది రత్నం ఇల్లేనా కాదా అని గేటు ప్రక్కన కట్టిన బోర్డు చూసి రత్నం ఇల్లేనని నిర్ధారణ చేసుకొన్నాడు.

వెంకట్రామయ్య ఊరు వదిలి టౌన్లో స్థిరపడ్డాడు. ఒకప్పుడు రత్నం వెంకట్రామయ్య పశువులను కాసేవాడు. ఆ రోజుల్లో 'ఒరే రత్నం' ఒరే రత్తిగా అని పిలిచేవాడు. ఇప్పుడలా పిలిస్తే రెండు చెంపలు వాయిస్తాడు. ఎందుకంటే రత్నం ఈ ఊరి సర్పంచ్.

కొన్ని సంవత్సరాల క్రితం వెంకట్రామయ్య ఆ ఊరి మోతుబరి రైతు, సర్పంచీ కూడా. ఆ రోజుల్లో రత్నంగానీ రత్నం కులం వాళ్ళుగానీ వెంకట్రామయ్య ఇంటి ముందు నుండిగానీ వెంకట్రామయ్య కులంవాళ్ళ ఇంటి ముందునుండిగానీ చెప్పులేసుకొని వెళ్ళటానికి కూడా వీలులేదు. చెప్పులు చేతిలో పట్టుకొని పోవల్సిందే.

'రత్నంగారూ' అని మరోసారి కేకేశాడు వెంకట్రామయ్య.

'ఎవరూ- లోపలికి రాండి' అని రత్నం కేకేశాడు.

అసలు రత్నానికి తెలివితేటలు లేకుండా, రాకుండా తానెంతో జాగ్రత్తపడ్డాడు ఆ రోజుల్లో- కానీ 'వాడి' వలన రత్నానికి చదువు సంధ్య అబ్బి ఇంతవాడయ్యాడు. రత్నానికి సాయం చేసిన 'వాడి' మీద వెంకట్రామయ్యకు పట్టరాని కోపం వచ్చింది.

అసలు ఆ వూర్లో బ్రాహ్మణులు, వైశ్యులు, చాలా సంవత్సరాల క్రితమే పట్నవాసానికి వెళ్ళారు. వెంకట్రామయ్యతో సహా వాళ్ళ కులం వాళ్లంతా ఈ మధ్యనే పట్నాలకు చేరారు. ఇప్పుడు ఆ వూర్లో రత్నం కులం వాళ్లదే రాజ్యం.

రత్నం భార్య వచ్చి గేటు తలుపు తీసింది 'రత్నం ఉన్నాడమ్మా' అని అడిగాడు వెంకట్రామయ్య. 'ఉన్నారు- రండి లోపలికి' అని పిలిచింది ఆవిడ. వెంకట్రామయ్యగారు వరండాలోకి వెళ్ళి నిలుచున్నాడు. రత్నం లోపలి నుండి రాలేదు. వరండాలో రెండు పెద్ద పటాలున్నాయి. ఒకటి అంబేద్కర్ ఫొటో. రెండవది 'వాడి' ఫొటో. 'వాడి' ఫొటో చూడగానే వెంకట్రామయ్య పళ్ళు పటపటా కొరికాడు.

రత్నం ఇంట్లో నుండి వరండాలోకి వచ్చాడు. రత్నంది భారీ విగ్రహం.మెలిదిరిగిన కండలు. నిశితమైన చూపు. మంచి ముఖ తేజస్సు.

'ఏం వెంకట్రామయ్యా- ఇలా వేంచేశావు?' అన్నాడు రత్నం.

కనీసం గారు అని కూడా సంబోధన లేనందుకు వెంకట్రామయ్య ముఖం చిన్నబోయింది.

ఎటువంటి వెంకట్రామయ్యకు ఎటువంటి గతి పట్టింది.

'ఇదో ఓ కుర్చీ పట్రా' అని భార్యను కేకేశాడు. రత్నం శ్రీమతి తెచ్చిన కుర్చీలో కూర్చుంటూ-

'ఏం కావాలి- వెంకట్రామయ్యా'

నిలబడే వున్న వెంకట్రామయ్య ముసలి పనికిరాని ఎద్దులా రత్నం ముందు క్రింద కూర్చోలేక 'పొలం అమ్ముదామని వచ్చా' అన్నాడు.

పొలం అమ్మమని కొడుకులు చేస్తున్న వత్తిడి తట్టుకోలేక రత్నం దగ్గరకువచ్చి తల వంచవలసి వచ్చింది వెంకట్రామయ్యకు. ఒకప్పుడు తను ఎన్ని పొలాలు కొన్నాడో ఎంత అర్జించాడో ఇప్పుడు తన పాలేరు దగ్గర అభిమానం చంపుకొని నిలబడాల్సి వచ్చింది.

'అమ్మవయ్యా దానికి నా ఆజ్ఞ దేనికి?' అన్నాడు రత్నం.

'ఈ ఊర్లో మోతుబరివి నీవే కదా. నీ ఆజ్ఞ ఈ ఊర్లో సుగ్రీవాజ్ఞ కదా. ఐనా నీవు తప్ప కొనే స్థోమత మాత్రం ఎంత మందికి ఉంది కనుక' కాస్త పొగిడితేనన్నా మనసు కరుగుతుందేమోనని ఆశపడ్డాడు వెంకట్రామయ్య.

'ఇదుగో ఓ గ్లాసు మజ్జిగ తీసుకరా' అని భార్యను కేకేశాడు రత్నం.

భార్య తెచ్చిన మజ్జిగ త్రాగుతూ 'సరే ఎకరం ఎంతకు అమ్ముతావు' అన్నాడు రత్నం.

మరీ ఏక వచన సంబోధన వెంకట్రామయ్య మనసును కలిచివేస్తున్నది. ఇదే ఊర్లో తను ఎలా బ్రతికాడు? తనకున్న ఇద్దరు కొడుకులకూ కూతురుకూ లక్షలకొద్దీ డొనేషన్లు కట్టి డాక్టరు కోర్సులు చదివించాడు. వాళ్ళు ముగ్గురూ తలా ఒక ఊర్లో ప్రాక్టీసుపెట్టి లక్షలకొద్దీ సంపాదిస్తున్నారు. భార్యపోయిన దగ్గర్నుండీ తనొక్కడే గుంటూర్లో లాడ్జిలో రూం తీసుకుని హోటల్ భోజనంతో కాలక్షేపం చేస్తున్నాడు. పల్లెలో పొలం అమ్మి తెస్తేనే మా దగర ఉండమని కొడుకులు వార్నింగ్ ఇచ్చారు!

'ఎకరం ఇరవై వేలు ఉందిగా ఊర్లో' అన్నాడు వెంకట్రామయ్య

'ఊర్లో ఎంతైనా ఉండనియ్యండి. ఎకరం నాలుగువేల చొప్పున ఇస్తే ఇవ్వండి- లేకపోతే బీడు పెట్టుకో' అని కుర్చీలో నుండి లేచి ఇంట్లోకి పోబోయాడు రత్నం.

'ఇది అన్యాయం' అన్నాడు వెంకట్రామయ్య.

'అన్యాయం అనే మాట అనే అర్హత నీకు లేదు వెంకట్రామయ్య' నీ ఇష్టమైతే ఎకరం నాలుగువేల చొప్పున అమ్ము లేదంటే తక్షణం నా ఇంట్లో నుండి వెళ్ళిపోవచ్చు. బస్సు వేళ కూడా అయిపోతున్నది- నాకు అవతల బోల్డు పనులున్నాయి.

క్షణం ఆలోచించాడు వెంకట్రామయ్య. ఇప్పటికే పొలం పరిస్థితి అస్థవ్యస్థంగా ఉంది. ఆ ఇరవై ఎకరాలు ఎలాగో అమ్ముకోకపోతే ఈ మాత్రం ధర కూడా భవిష్యత్తులో రాకపోవచ్చు.

'సరే. నీ ఇష్టం వచ్చిన ధరకే తీసుకో!' అన్నాడు వెంకట్రామయ్య.

'నేను సోమవారం రిజిష్టారు ఆఫీసు దగ్గరకు వస్తాను మన ఊరి కరణం గారు కూడా టౌన్లోనే ఉంటున్నారుగా వారి సాయంతో మీకు ఆ రోజే డబ్బు కట్టి రిజిష్టరు చేయించుకుంటా.'

కరణంగారు... వెంకట్రామయ్యకు ఆ మాట విని చీమలు ప్రాకినట్లు అనిపించింది. ఎదురుగా ఉన్న నన్ను ఏక వచన సంబోధన. ఉద్యోగం ఊడి ఊరొదిలి పెట్టిన కరణాన్ని కరణంగారు అని సంబోధనా?

'సరే సోమవారం రిజిష్టరు ఆఫీసు దగ్గర ఎదురు చూస్తూ ఉంటా' అని వెళ్ళిపోయాడు వెంకట్రామయ్య.

వెంకట్రామయ్య వెళ్ళిపోగానే బరువు దింపినట్లు ఫీలైనాడు. ఇప్పుడు మనసెంతో తృప్తిగా ఉన్నది.

*   *   *   *

సుమారు ఇరవై ఐదు సంవత్సరాల క్రితం అప్పుడు రత్నానికి పదిహేనేళ్ళుంటాయి. చేలో జొన్న పీకుతున్నాడు. గంటసేపు పీకితేకాని పెద్ద మోపుకాదు. పెద్ద మోపు తీసుకెళ్తేగాని తన యజమాని వెంకట్రామయ్య ఊరుకోడు. పైగా ఇది వెంకట్రామయ్య పొలం కాదు. జమదగ్ని శర్మ పొలం. ఎవరన్నా చూస్తారేమోనని చాటు చాటుగా కోయాలి. కోసిన మేత వరకు పెద్ద మూట కట్టి నెత్తిన పెట్టుకున్నాడు-

ఇంతలో జమదగ్ని శర్మ పొలం దగ్గర ప్రత్యక్షమయ్యాడు.

'ఏంరా రత్నం దొంగతనం చేస్తున్నావా?' అన్నాడు. 'కాదు స్వామీ. మీ చేలోనే కోసుకొని రమ్మని వెంకట్రామయ్య గారు పంపారు. అందుకని'

'ఐతే నీ తప్పు లేదన్నమాట- సరే ఎలాగు కష్టపడి కోశావు- తీసుకపో- లేకపోతే నీవు ఇబ్బంది పడతావు' అన్నారు శర్మగారు.

'అదేమిటండీ తీసుకపొమ్మంటారు- తప్పు కాగా?' అన్నాడు రత్నం.

'తప్పే ఐతే నీ తప్పు కాదు నీ యజమాని చెప్పింది నీవు చేస్తున్నావు కనుక ఆ పాపం నీ యజమానికే చెందుతుంది.'

జమదగ్ని శర్మ వేదం చదువుకున్నాడు. సంస్కృతం, తెలుగు ఇంగ్లీషులు క్షుణ్ణంగా నేర్చుకొన్నాడు. స్వంత ఊరు కదలకుండా పిల్లలకు ప్రైవేట్లు చెప్పుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఐతే సంతానభారం అధికం ఐదుగురు ఆడపిల్లలు, ఒక్కడే మగ పిల్లవాడు.



ఆస్తిపాస్తులంతా అమ్మాయిల పెళ్ళిళ్లకే చాలా వరకు కరిగిపోయింది. కొడుకు చిన్నవాడు. ఇప్పుడే హైస్కూలు చదువుకు వచ్చాడు.

'చూడు రత్నం ఆ గడ్డి మోపు మీ యజమాని ఇంట్లో వేసి మా ఇంటికి ఓ సారి రా' అని చెప్పి శర్మ వెళ్ళిపోయాడు.

రత్నం మనసెంతో బాధపడింది. తనను దొంగతనంగా శర్మగారి పొలంలో తీసుకరమ్మనటం వెంకట్రామయ్యకు ఇది మొదటిసారి కాదు. ఇంతకు ముందు ఎన్నోసార్లు తీసుకెళ్ళాడు గానీ ఈసారి పట్టుబడ్డాడు. శర్మగారు తననుగట్టిగా అరిచినా బావుండేది- కానీ ఆయన మెత్తని మాటలు తనలో అనూహ్యమైన మార్పును తెచ్చాయి.

గడ్డి మోపు తెచ్చి పశువులకు వేసి- త్వర త్వరగా ఇంటికి వెళ్ళి స్నానం చేసి సూర్యాస్తమయం అయేలోగా శర్మగారి ఇంటికి వెళ్లాడు రత్నం.

'రత్నం లోపలికి రా' అని ఆహ్వానించాడు శర్మగారు.

'మీ ఇంట్లోకి రావొచ్చాండీ' అనుమానంగా అడిగాడు రత్నం. రత్నాన్ని వెంకట్రామయ్యగారింట్లో డైనింగ్ హాల్లోకిగానీ వంట గదిలోనికి కానీ రానివ్వరు. అన్నం పెట్టినా చింది పడేట్లు ఎత్తి పడేస్తారు.

'ఏ అభ్యంతరం లేదు- ఏ శాస్త్రంలో కూడా మీరు మా ఇంట్లోకి రాకూడదని వ్రాయలేదు- లోపలికి రా' అన్నారు శర్మగారు. చాప ఇచ్చి 'కూర్చో'మన్నారు.

'చూడు రత్నం రోజూ సాయంకాలం ఒక గంట మా ఇంటికి రా' అన్నారు శర్మగారు.

'ఏం పని చెయ్యమంటారు'

'పని కాదు- నీకు చదువు చెబుతా- నేర్చుకుందువుగానీ'

'చదువా? నాకా అండీ!'

'ఏం చదువుకోవా? ఏం కష్టం లేదు'

'సరేనండీ'

'రేపు మంచిరోజు- తప్పక రావాలి సుమా' అన్నారు శర్మగారు.

ఐదు వసంతాలు దొర్లిపోయాయి. రత్నానికి తెలుగు ఇంగ్లీషు సంస్కృతాల్లో మంచి పునాది వేశారు శర్మగారు. ఇంతలో శర్మగారి కొడుకు కాలేజీ చదువుకు వచ్చాడు. శర్మగారి ఆస్తి అప్పటికే చాలా ఐపోయింది. కుర్రాడి చదువుకోసం పట్నంలో కాపురం పెట్టాడు. కుర్రాడు ఇంటర్ ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు.

కొడుకుని ఇంజనీరింగ్ చదివించాలని శర్మగారి పట్టుదల. ఐతే చేతిలో చిల్లిగవ్వ లేదు, తన స్వంత ఊర్లో ఆరెకరాల పొలం తప్ప. పట్నం నుండి తన ఊరు వచ్చాడు. ఆ వూర్లో పొలం కొనాలన్నా అమ్మాలన్నా సర్పంచి వెంకట్రామయ్యకు తెలియకుండా జరగటానికివీలు లేదు. నేరుగా వెంకట్రామయ్య ఇంటికే వెళ్ళాడు శర్మ.

గేటు దగ్గరే రత్నం ఎదురయ్యాడు.

'ఏం రత్నం. మీ యజమాని ఇంట్లోనే ఉన్నారా'

'ఉన్నారండీ- పిలుస్తాన'ని లోపలికి వెళ్ళాడు.

వెంకట్రామయ్యగారు అప్పుడే భోంచేసి తాంబూలం వేసుకొని ఇంటికొచ్చిన శర్మను చూసి 'ఏమయ్యా- ఏం పనిమీద వచ్చావు' అని వెంటనే రత్నంవైపు తిరిగి ఒరే రత్నం వరండాలో ఉన్న కుర్చీలన్నీ లోపల వేసి ఒక్కటి ఉంచు అన్నాడు. రత్నం మనసులో బాధపడుతూ కుర్చీలన్నీ లోపల వేశాడు. మిగిలిన కుర్చీలో వెంకట్రామయ్య కూర్చొని

'ఏం చెప్పరేం? ఏం పని మీద వచ్చారు' అని అడిగాడు శర్మగారిని.

-శర్మగారు నేల చూపులు చూస్తూ- మా వాడు ఇంటర్ ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యాడండీ. మద్రాసు ఐ.ఐ.టి.లో ఇంజనీరింగ్ సీటు వచ్చిందండీ.

'ఆ వస్తే'

'డబ్బు కావాలండీ'

'నా దగ్గర చెట్టుకు కాస్తున్నాయా డబ్బులు?'

'అదికాదండీ'

'ఏది కాదండీ'

'నా పొలం అమ్ముతానండీ'

'అమ్ముకోవయ్యా- దానికి నా ఆజ్ఞ దేనికో'

'మీకే అమ్ముతానండీ. మీరు తప్ప ఇప్పుడు ఎవరు కొంటారండీ'

'సరే కొంటాలే, ఎన్నెకరాలుంది?'

'ఆరెకరాలండీ'

'ఊర్లో ఎకరం ఐదువేలుంది కాని పైకం లేదూ అంచేత ఎకరం ఐదువందల చొప్పున అయితే తీసుకొంటా లేకపోతే నీ ఇష్టం' అని లేచి ఇంట్లోకి పోబోయాడు.

ఈ సంభాషణంతా రత్నం వింటూనే ఉన్నాడు- శర్మగార్ని కనీసం కూర్చోమనికూడా అనకపోగా ఏకవచన సంబోధన చేయటం రత్నానికిచాలా బాధవేసింది. ఆ మహా పండితుడి కాలి గోర్లపాటి చెయ్యడీ వెధవ. ఆస్థిని చూసుకొని మిడిసిపడటం తప్ప. ఐనా తనేం చేయగలడు.

'సరేనండీ మీ ఇష్టం వచ్చిన ధరకు తీసుకోండి'

'సరే నేను రేపు పట్నం వస్తాను. రిజిస్ట్రారు ఆఫీసు దగ్గర కలువు- ఇక వెళ్ళు' అని శర్మను పంపించాడు.

ఋతువులు క్రమం తప్పకుండా మారుతూనే వున్నాయి. కాల చక్రం కలియుగంలో త్వరితగతిన తిరుగుతున్నది. పల్లెలో అనేక మార్పులు వచ్చాయి. వెంకట్రామయ్య తన కులం వాళ్ళతో సహా పిల్లల చదువుకోసం పట్నం చేరాడు. రత్నం ప్రైవేటుగా బి.ఎ., ఎం.ఎ. వ్రాసుకొని ఊర్లో వ్యవసాయాన్ని నమ్ముకొని స్థిరపడిపోయాడు.

వెంకట్రామయ్య పొలాన్ని చౌకగా కొని ఆ పొలం మొత్తాన్ని 'జమదగ్నిశర్మ మెమోరియల్ ట్రస్టు' క్రింద జమకట్టి హైస్కూలు కాలేజీల స్థాపనకు కృషిచేస్తున్నాడు.

అందుకే తన ఇంటిలో నిలువెత్తు అంబేద్కర్ ఫొటో ప్రక్కనే 'జమదగ్ని శర్మ' ఫొటో పెట్టుకొని పూజిస్తున్నాడు- ●

మీ జి.కె. ఎంత? జవాబులు

(1) అయిదుగురు-వారు (1) ఐ. కె. ఆర్. వి. రావు (ఆర్థిక శాస్త్రవేత్త), (2) జస్టిస్ డి. డి. బసు (రాజ్యాంగ నిపుణుడు), (3) డా. సి. ఆర్. రావు (గణితం), (4) డా. ఎ. అప్పాదొరై (రాజకీయ శాస్త్రం) మరియు (5) శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మి. (2) విలియం ఇవార్ట్‌గ్లాడ్‌స్టోన్ (3) శంకర్-జైకిషన్ (4) స్కూలంటే భయపడటం (5) ఫిబ్రవరి 28 (6) గున్నార్ మిర్డాల్ (1974 ఆర్థికశాస్త్రం); ఆల్వామిర్డాల్ (1982, శాంతి) (7) షెర్లాక్‌హోమ్స్. 1900-1988 మధ్య తీయబడిన 194 సినిమాల్లో 69 మంది ఈ పాత్రను పోషించారు. (8) రాజేంద్రప్రసాద్ (9) ఏప్రిల్ 11, 1984 (10) చండీఘడ్.